ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
5★★★
ఆదివారం 20 జూలై 2025



నేడు రౌండ్ టేబుల్ సమావేశం

సిరిసిల్ల టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : యువతను రాజకీయాల్లోకి ప్రోత్సహిస్తూ ఆదివారం జిల్లా కేంద్రంలో రాజకీయాల్లో యువత అనే అంశంపై జిల్లా స్థాయిలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు శనివారం టీపీసీసీ సభ్యుడు బుర్ర రవితేజ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో ఉన్న అన్ని రాజకీయ పార్టీలు, కుల సంఘాలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల యువ నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు పెద్ద సంఖ్యలో పాల్గొని రాజకీయాల్లో యువత అంశంపై నిర్వహిస్తున్న రౌండ్ టేబుల్ సమావేశంను విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన వసతులు..

- జిల్లా విద్యాధికారి వినోద్



వివరాలు తెలుసుకుంటున్న జిల్లా విద్యాధికారి వినోద్

ఇల్లంతకుంట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో వసతులు మెరుగు అయ్యాయని జిల్లా విద్యాధికారి వినోద్ పేర్కొన్నారు. మండలంలోని దాచారం గ్రామంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను శనివారం పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్నా ఒక ఉపాధ్యాయుడికి డిప్యూటేషన్‌పై పంపడం పట్ల ఫిర్యాదు చేయడం జరిగింది. విద్యాధికారి పాఠశాలకు వచ్చి విద్యార్థులు ఎందరు ఉన్నారని పరిశీలించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు ఉండేలా కృషిచేస్తానన్నారు. తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం కలుగడం వల్లనే విద్యార్థుల నమోదు భారీగా పెరిగిందన్నారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టాలని సూచించారు. అనంతరం ఉన్నతపాఠశాలలో జరిగిన బోనాల సంబరాలలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీనివాస్‌గౌడ్, ప్రధానోపాధ్యాయులు రాణి, బాలగౌడ్, ఉపాధ్యాయులు నరేందర్‌రెడ్డి, శ్రీను, ఆనంద్, దావీద్, శ్రీనివాస్, సంజీవ్, శ్రావణ్ కుమార్, పంచాయితీ కార్యదర్శి అంజలి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఫొటోగ్రఫీ డిప్లొమా కోర్సు..

సిరిసిల్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఉచిత ఫొటోగ్రఫీ డిప్లొమా కోర్సు పోస్టర్‌ను శనివారం హైదరాబాద్‌లో తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ ఆవిష్కరించారు. తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ, సిగ్మా అకాడమీ ఆఫ్ ఫొటోగ్రఫీ(శాప్) సంయుక్త ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నారు. సిరిసిల్లకు చెందిన అంతర్జాతీయ ఫొటోగ్రాఫర్ ఎంసీ శేఖర్ కొన్ని సంవత్సరాలుగా హైదరాబాద్ వేదికగా సిగ్మా అకాడమీ ఆఫ్ ఫొటోగ్రఫీ స్థాపించి యువతకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. ఆగస్టు 5 తేదిన ఐదో బ్యాచ్‌ను ప్రారంభిస్తున్నారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాటాడుతూ యువత ఫొటోగ్రఫీ నేర్చుకొని, ఉపాధి కోసం వృత్తిగా స్వీకరించేవారు ఈ కోర్సును నేర్చుకోవచ్చని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో గత నాలుగు బ్యాచ్‌లలో దాదాపు 1600 మందికి పైగా యువత విజయవంతంగా ఉచిత ఫోటోగ్రఫీ డిప్లొమా కోర్సు అభ్యసించారని శేఖర్ అన్నారు. వివరాలకు 8008021075 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఫసల్ బీమా.. లేనట్లేనా..?



- నాలుగేళ్లుగా అటకెక్కిన పథకం
- ప్రకృతి వైపరీత్యాలకు నష్టపోతున్న రైతులు
- బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వం
- జిల్లాలో వానాకాలం సాగు 2.43 లక్షల ఎకరాలు
- ఇప్పటికే జిల్లాలో 1.16 లక్షల ఎకరాల్లో సాగు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

ప్రకృతి వైపరీత్యాలకు రైతులు నిండా మునుగుతున్నారు. రైతులకు కాస్తో కూస్తో ధీమానిచ్చే ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) పథకం నాలుగేళ్లుగా అమలుకు నోచుకోవడం లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణలో ఫసల్ బీమాను అమలు చేయకుండా నిర్లక్ష్యం చేయగా, బీమాను అమలుచేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం అదే దారిలో విస్మరించిందనే విమర్శలు వస్తున్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా రైతులు గత యాసంగిలోనే ఫసల్ బీమా వస్తుందని భావించినా నిరాశే మిగిలింది. ఈసారి వానాకాలం సీజన్‌లో చేస్తారని ప్రచారం జరిగినా అమల్లోకి వచ్చే సూచనలు కనిపించకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. వానాకాలం సీజన్ ఆలస్యం కావడంతో రైతులు బీమా వర్తింపచేయడం ఈసారికూడా కష్టమే అవుతుందని తెలుస్తోంది. రాష్ట్రంలో 11 క్లస్టర్లుగా విభజించి అమలు చేయాలని బావించారు. కానీ ఆచరణకు రావడం లేదు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో వానాకాలం సీజన్‌లో 2.43 లక్షల ఎకరాలు, యాసంగిలో 1.80లక్షల ఎకరాల వరకు వివిధ పంటలు సాగు చేస్తున్నారు. ప్రతి సీజన్‌లోనూ వడగండ్ల వర్షాలు, కుంభవృష్టితో రైతులు తీవ్రంగా నష్టపోతూనే ఉన్నారు. పంట చేతికి వచ్చే దశలో రైతులకు నష్టం కలగకుండా 2016లో ఫసల్ బీమా పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఆ పథకాన్ని 2020లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిలిపివేసింది. బీమాపై అవగాహన లేకపోవడంతో రైతులు సద్వినియోగం చేసుకోలేదు. ఏప్రిల్‌లో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పంటల బీమా పథకానికి విధి విధానాలు రూపొందించాలని ఆదేశాలు ఇచ్చినా ఇప్పటివరకు ఎలాంటి కదలిక కనిపించడం లేదు.

బీమాతో రైతులకు ధీమా...

వానాకాలం, యాసంగి సీజన్లలో పంటలు వేసుకునే రైతులకు ఫసల్ బీమా యోజన ధీమాగా ఉంటుంది. పంట నీటమునిగిన వడగండ్ల వాన, ఇసుక మేటలు వేసినా, తుఫాను ప్రభావంతో పంటలకు కలిగే నష్టాలకు బీమా వర్తిస్తుంది. బీమాకు సంబంధించి ప్రీమియంలో రైతు వాటా వానాకాలం సీజన్‌లో 2 శాతం, యాసంగిలో 1.5 శాతం, వాణిజ్య ఉద్యాన వన పంటలకు 5 శాతం ఉంటుంది. మిగిలిన ప్రీమియంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు 50 శాతం చొప్పున భరిస్తాయి. ఇందులో రైతు వాటా ప్రభుత్వమే చెల్లిస్తుందని గతంలో ప్రకటించారు. ప్రస్తుతం దీనిపై కూడా స్పష్టత రావాల్సి ఉంది. వానాకాలంలో ఐదు పంటలు, యాసంగిలో ఆరు పంటలకు వర్తించే యోచన కూడా చేశారు. వానాకాలంలో వరి, కందులు, మొక్కజొన్న, వేరుశెనగ, జొన్న, యాసంగిలో వరి, పప్పుదినుసులు, మొక్కజొన్న, వేరుశెనగ, మినుములు, జొన్న పంటలకు వర్తింపచేస్తారని రైతులు భావించారు. కానీ ఫసల్ బీమా యోజనపై మార్గదర్శకాలే జారీ కాలేదు. ఫసల్ బీమా యోజన అమలు జరిగితే 2.5 ఎకరాల పంట నష్టంలో 33 నుంచి 50 శాతం వాటిల్లితే వరికి రూ 1.05 లక్షలు, మొక్కజొన్న రూ 90వేల పరిహారం అందుతుంది. జిల్లా, మండల, గ్రామాల యూనిట్‌లుగా పంటల బీమా వర్తిస్తుందని రైతులు ఎదురుచూస్తున్నారు.

జిల్లాలో 1.10 లక్షల మంది రైతులకు లబ్ధి

ఫసల్ బీమా యోజన అమలుచేస్తే రాజన్న సిరిసిల్ల జిల్లాలో 1.10 లక్షల మంది రైతులతో పాటు 80 వేల మంది కౌలు రైతులకు కూడా ఉపయోగపడనుంది. జిల్లాలో పట్టాదారులతో పాటు కౌలు రైతులకు కూడా ప్రభుత్వం భరోసా కల్పించే హామీలు ఇచ్చిన నేపథ్యంలో కౌలు రైతులకు ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. జిల్లాలోని 13 మండలాలు, 171 రెవెన్యూ గ్రామాలు, 260 గ్రామపంచాయతీల పరిధిలో 83 వేల హెక్టార్‌లలో భూకమతాలు ఉన్నాయి. జిల్లాలో 2.43 లక్షల ఎకరాల్లో భూములు ఉండగా 2.47 ఎకరాకలకు సంబంధించి 81,416 ఎకరాలు 75,931 మంది రైతుల వద్ద ఉంది. 2.47 నుంచి 4.93 ఎకరాలకు సంబంధిచి 25,092 మంది రైతుల వద్ద 86,460 ఎకరాలు, 4.94 నుంచి 9.87 ఎకరాలకు సంబంధించి 8,346 మంది రైతుల వద్ద 53,560 ఎకరాలు, 9.88 నుంచి 24.70 ఎకరాలకు సంబంధించి 1,427 మంది రైతుల వద్ద 18,962 ఎకరాల భూమి ఉంది. 87 మంది రైతుల వద్ద 24.71 ఎకరాలకు పైన 2,756 ఎకరాల భూములు ఉన్నాయి. ఇందులో వానాకాలంలో ..

మిగతా 8లో

కూలిన కల్వర్టు.. పరిశీలించిన నాయకులు



కోరుట్లపేటకు వెళ్లే దారిలో కూలిన కల్వర్టు

ఎల్లారెడ్డిపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సత్సంగ సదనం నుంచి కోరుట్లపేట గ్రామానికి వెళ్లే దారిలో పెద్దవాగుపై ఉన్న కల్వర్టు శనివారం కూలిపోయింది. ఆ సమయంలో వాహనదారులు, బాటసారులు లేకపోవడంతో ప్రమాదం తప్పినట్లయింది. గతంలో కురిసిన భారీ వర్షాలకు కల్వర్టు కింద భాగం పూర్తిగా కోతకు గురైంది. మరమ్మత్తులు చేయకపోవడం వల్ల ఈనెల 18న రాత్రి కురిసిన వర్షానికి కూలిపోయిందని రైతులు, వాహనదారులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి కల్వర్టును నిర్మించి ప్రయాణ కష్టాలను తీర్చాలని కోరుతున్నారు.

కల్వర్టుల నుంచి కాళేశ్వరం దాకా..

కల్వర్టుల నుంచి కాళేశ్వరం జలాశయం దాక నిర్మించిన కట్టడాల్లో నాణ్యత లేక కూలిపోవడం, కుంగిపోవడంతో గత బీఆర్ఎస్ అవినీతి జాడలు బయటపడుతున్నాయని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధి నిర్మించిన చెక్ డ్యాంలో నాణ్యత లోపం వల్ల నీరు లేకుండాపోయిందని, అక్కడ సంబరాలు ఎందుకు నిర్వహించలేరని ప్రశ్నించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సత్సంగసదనం నుంచి కోరుట్లపేట మధ్యలో గల పెద్దవాగుపై కూలిన కల్వర్టును స్థానిక నాయకులతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ అందిన కాడికి దోచుకుందని అన్నారు. నాణ్యత ప్రమాణాలను గాలికి వదిలేసి నిర్మాణాలు చేపట్టడం వల్ల కూలిపోతున్నాయని అన్నారు. కమీషన్ల రూపంలో ప్రజాధనాన్ని జేబులు నింపుకుందని ఆరోపించారు. బీఆర్ఎస్ దోపిడీ వల్ల రైతులు, ప్రజలు ఇబ్బందులు పడే దుస్థితి నెలకొందని అన్నారు. సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి కూలిన కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేసేలా చూస్తామని నర్సయ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, బాబు, విజయ్ రెడ్డి, గౌస్, కిషన్, బుచ్చాగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, కిషన్ తదితరులు ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలి

- కేసుల విచారణలో జాప్యం చేయొద్దు - నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ మహేష్ బి గీతే



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మహేష్ బి గీతే

సిరిసిల్ల క్రైం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని ఎస్పీ మహేష్ బి.గీతే అన్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కేసులో సమగ్ర దర్యాప్తును చేపట్టి నేరస్తులకు శిక్ష పడే విధంగా అధికారులందరూ కృషి చేయాలన్నారు. కేసుల విచారణలో జాప్యం చేస్తే సహించేది లేదని పోలీస్ అధికారులంతా బాధ్యతగా వ్యవహరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ బాధితులకు న్యాయం చేకూరేలా పని చేయాలని తెలిపారు. ప్రాసిక్యూషన్‌లో భాగంగా కోర్టు వారు జారిచేసిన నాన్ బెయిలబుల్ వారెంట్లను నిందితులపై, తప్పించుకుని తిరుగుతున్న నేరస్తులపై పకడ్బందీగా అమలుచేయాలనలన్నారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ రద్దీగల ప్రాంతాల్లో, ప్రధాన కూడళ్ళ వద్ద గస్తీకాస్తూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు, మట్కా, జూదంలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయిని రవాణా చేసే వ్యక్తులతో పాటు గంజాయిని సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి వాటి నివారణకు సంబంధిత అధికారులతో సమన్వయం పాటిస్తూ ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలన్నారు. మద్యం సేవించి వాహనాలను నడుపుతూ,ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వారి గురించి నిరంతరం వాహన తనిఖీలు చేపట్టి పట్టుబడిన వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా మారుమూల ప్రాంతాల్లో ప్రజలకు తలెత్తుతున్న సమస్యలకు తక్షణమే స్పందించి సత్వర సేవలందించేందుకు రాష్ట్ర పోలీస్ శాఖ నుంచి కేటాయించబడిన పెట్రోకార్, బొలెరో వాహనాల నిర్వహణపై అధికారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లకు చెందిన పెట్రోకార్, బొలెరో వాహనాలను తనిఖీచేసి వాటి నిర్వహణ పరిస్థితిపై సమగ్ర సమాచారం తెలుసుకొని,వాహనాలు ఎల్లప్పుడూ కండిషన్‌లో ఉండేలా చూసుకోవడం ద్వారా అనుకోని సంఘటనలు జరిగిన సందర్భాల్లో తక్షణమే స్పందించి సకాలంలో ఘటనా స్థలానికి చేరుకునే అవకాశం కలుగుతుందన్నారు. ఈసమావేశంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, సీఐలు మొగిలి, శ్రీనివాస్, వీరప్రసాద్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, మధుకర్, నాగేశ్వరరావు, నటేష్, ఆర్ఐలు మధుకర్, రమేష్, యాదగిరి, ఎస్ఐలు ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్మీడియేట్ సీట్ల భర్తీకి 22న స్పాట్ అడ్మిషన్లు

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు(కేజీబీవీఎస్)లో ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరంలో వివిధ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీచేయడం కోసం ఈనెల 22న స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ జరుగుతుందని జిల్లా విద్యాధికారి వినోద్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని బోయినపల్లిలో బైపీసీ 18, ఎంఎల్‌టీలో27, వేములవాడ అర్బన్‌లో సీఈసీలో 20, ఏఐఎంఎల్‌లో 25, ఇల్లంతకుంటలో ఎంపీసీ 14, బైపీసీ 4, రుద్రంగిలో ఎంపీసీ 4, వీర్నపల్లిలో ఎంపీసీ 20, బైపీసీ 1, తంగళ్లపల్లిలో సీఈసీ 5, గంభీరావుపేటలో సీఈసీలో 15 సీట్లు ఉన్నాయని తెలిపారు. వీటికి మంగళవారం ఆయా విద్యాలయాల్లో స్పాట్ అడ్మిషన్‌లు జరుగుతాయని, అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఈవో కోరారు.

వేములవాడలో కురిసిన భారీ వర్షం



భారీగా కురిసిన వర్షానికి ప్రవహిస్తున్న మూలవాగు

వేములవాడ టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. రాత్రి 8గంటల నుంచి 9.30గంటల వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. పట్టణంలోని కట్టుకాలువ, తిప్పాపూర్‌లోని నిమ్మ ఒర్రెలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వేములవాడ మూలవాగులో బతుకమ్మ తెప్పె వద్ద నిర్మించిన చెక్ డ్యాం మత్తడి దూకి వరద ప్రవహిస్తుంది. పట్టణంలోని జాతరగ్రౌండు, ద్వారకనగర్, కొనాయపల్లి శివారులోని మట్టి రోడ్లు కోతకు గరవడంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. పలు కాలనీల్లో డ్రైనేజీలు లేకపోవడంతో నీరు నలిచి కనిపించాయి.

రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ

- పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క కార్డు ఇవ్వలేదు..
- వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

8

ఆయిల్ పామ్ సాగు వైపు మొగ్గు చూపాలి

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



ఆయిల్‌పామ్ గెలలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

బోయినపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను పొందాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బోయినపల్లి మండలం మార్లపేట గ్రామంలో ఆయిల్‌పామ్ మొదటి గెలల కోత, కొనుగోలు కార్యక్రమంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎక్కువ విస్తీర్ణంలో ఒకే పంటకు బదులు ఆయిల్‌పామ్ కూడా సాగు చేయాలన్నారు. తాను కూడా ఆయిల్‌పామ్ పంట సాగుచేస్తానని అన్నారు. అనంతరం కంపెనీ ద్వారా కొనుగోలు ఒప్పంద పత్రాలని రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ ముదుగంటి సురేందర్‌రెడ్డి, సెస్ డైరెక్టర్ కొట్టేపల్లి సుధాకర్, ఏఎంసీ ఛైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, వైస్ ఛైర్మన్ వినోద్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భీమ్‌రెడ్డి మహేశ్వర్‌రెడ్డి, ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ టి.శేఖర్, జిల్లా ఉద్యాన అధికారి లత, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్ నారాయణరెడ్డి, ఎంపీడీవో జయశీల, మండల వ్యవసాయ అధికారి ప్రణీత, ఉద్యాన శాఖ అధికారులు లోకేష్, గోవర్ధన్, ఏఈఓ రజిత, పంచాయతీ సెక్రెటరీ, ప్రియునిక్ కంపెనీ జనరల్ మేనేజర్ మల్లేశ్వరరావు, జోనల్ మేనేజర్ రోహిత్, జిల్లా మేనేజర్ ప్రేమ్‌సాయి, ఫీల్డ్ ఆఫీసర్ శ్రీకాంత్ రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు

బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు కట్ట గోవర్ధన్‌గౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరాడు. గ్రామానికి చెందిన 20 మంది బీఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి జిల్లా బీసీ అధ్యక్షుడు కూస రవీందర్ ఆధ్వర్యంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సమక్షంలో కాంగ్రెస్ పార్టీ చేరాడు. సింగిల్ విండో ఛైర్మన్ వెంకటరామారావు, పార్టీ మండల అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, నాగుల వంశీ తదితరులు పాల్గొన్నారు.



60 వసంతాల ఎస్‌కేఎన్‌ఆర్ కళాశాల

- రేకుల షెడ్డులో ప్రారంభమై.. జగిత్యాలకు తలమానికంగా నిలిచి
- ఎందరో మహానుభావులను తీర్చిదిద్దిన ఘనత
- వజ్రోత్సవాలకు సిద్ధం

జగిత్యాల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఆ కళాశాలకు 60 సంవత్సరాలు నిండాయి. ఓ రేకుల షెడ్డులో ప్రారంభమైన ఆ కళాశాల మారుమూల ప్రాంతాల పేద విద్యార్థులను అక్కున చేర్చుకొని ఉన్నత స్థానాల్లో నిలబెట్టింది. ఎందరో విద్యార్థులను డాకర్లు, ఇంజనీర్లు, అడ్వకేట్లు, జర్నలిస్టులను, ప్రజాప్రతినిధులను తీర్చిదిద్దింది. అదే జగిత్యాలలో శ్రీ కాసుగంటి నారాయణ రావు గవర్నమెంట్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల. జగిత్యాలకు చెందిన కాసుగంటి నారాయణరావు జిల్లా కేంద్రంలోని ధర్మపురి రోడ్‌లో 32.07 ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేసి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు విరాళంగా ఇచ్చాడు. ఆ స్థలంలో 1965 ఆగస్టు 12వ తేదీన ప్రారంభమైన ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల 'ఇంతింతై వటుడింతై' అన్న చందంగా ఎదిగింది.


కళాశాలలో తొలి బ్యాచ్ విద్యార్థులు

డిగ్రీ చదువుతున్నావా.. ఎక్కడ అంటే.. జగిత్యాల ఎస్‌కేఎన్‌ఆర్ కాలేజీలో.. పదేళ్ల క్రితం వరకు జగిత్యాల నుంచి మొదలుకుని ప్రస్తుత మంచిర్యాల జిల్లా గోదావరి తీర ప్రాంత గ్రామాల విద్యార్థులను ఎవరిని అడిగినా ఇదే సమాధానం వచ్చేది. ప్రస్తుతం ప్రైవేట్ కళాశాలలు ఏర్పడడంతో కొంత క్రేజ్ తగ్గినా ఎస్‌కేఎన్‌ఆర్ కళాశాల అంటే ఓ బ్రాండ్.. ఇక్కడ చదువుకున్న వారు ఎందరో ఉన్నత స్థానాలకు ఎదిగారు. ఈ కళాశాల పూర్వ విద్యార్థే ప్రస్తుతం ప్రిన్సిపాల్‌గా ఉండడం విశేషం.. ఓ రేకుల షెడ్డులో ప్రారంభమైన కళాశాల ప్రస్తుతం 60 సంవత్సరాలు పూర్తి చేసుకుని వజ్రోత్సవాలకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం..

పీవీ నరసింహారావు చొరవతో..

1965 సంవత్సరంలో జగిత్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో రేకుల గదులలో డిగ్రీ కళాశాల ప్రారంభమైంది. ఆ సమయంలో కళాశాలకు గుర్తింపు కోసం ఉస్మానియా విశ్వ విద్యాలయం పలువురు ప్రముఖులతో ఒక కమిషన్‌ను నియమించి పరిశీలనకు పంపించింది. కమిషన్ సభ్యుల్లో పీవీ నరసింహారావు ఉన్నారు. కళాశాల ఆవరణను పరిశీలించిన బృందం సభ్యులు నిబంధనల ప్రకారం వసతులు లేవనే నిర్ణయానికి వచ్చారు. పీవీ నరసింహారావు జోక్యం చేసుకొని ఇతర ప్రాంతాల్లో సైతం ఇలాంటి వసతులతోనే కళాశాలలు ప్రారంభించామని, తర్వాత అన్ని వసతులు సమకూరాయని చెప్పడంతో ఇతర సభ్యులు ఒప్పుకున్నారు. దీంతో పీవీ నరసింహారావు చొరవతో యూనివర్సిటీ నుంచి కళాశాలకు గుర్తింపు వచ్చినట్లు పూర్వ విద్యార్థులు అంటున్నారు.

ఉత్సవాలకు సన్నాహాలు..

జగిత్యాల ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల వజ్రోత్సవాలను నిర్వహించడానికి కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల కళాశాలను ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ ఎల్ రమణలు సందర్శించి వజ్రోత్సవాల నిర్వహణపై సూత్రప్రాయంగా చర్చించారు. హైద్రాబాద్‌లో ఒక ప్రత్యేక సమావేశం నిర్వహించి వజ్రోత్సవాల నిర్వహణపై నిర్ణయం తీసుకోనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆహ్వానించాలని భావిస్తున్నారు.

ఉన్నత స్థానంలో వేల మంది విద్యార్థులు..

జగిత్యాల ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల ఆరవై సంవత్సరాలుగా వేల మంది విద్యార్థులను తీర్చిదిద్దింది. సువిశాలమైన ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఈ కళాశాలలో ప్రస్తుతం డిగ్రీ, పీజీ విద్యకు సంబంధించిన పలు కోర్సులున్నాయి. అండర్ గ్రాడ్యుయేట్‌లో బీఏ, బీకాం, బీఎస్సీ, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీసీఏ, పోస్టు గ్రాడ్యుయేట్‌లో ఎంఏ ఇంగ్లీష్, ఎంఏ తెలుగు కోర్సులున్నాయి.

ఇంజనీరింగ్, పాలిసెట్ హెల్ప్‌లైన్ ఉన్నాయి. నిరుద్యోగుల కోసం బీసీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేశారు. జిల్లాలోని జగిత్యాల, ధర్మపురి, చొప్పదండి నియోజకవర్గాలు, మంచిర్యాల జిల్లాలోని గోదావరి తీర ప్రాంతంలో ఉన్న పలు గ్రామాలకు చెందిన విద్యార్థులు కళాశాలలో ప్రవేశాలు పొంది విద్యను అభ్యసిస్తున్నారు. ప్రస్తుతం కళాశాలలో 605 మంది విద్యార్థులున్నారు. 26 మంది బోధనా సిబ్బంది, 30 మంది బోధనేతర సిబ్బంది విద్యార్థులకు సేవలు అందిస్తు న్నారు. కళాశాలలో ఎన్‌ఎస్ఎస్, ఎన్‌సీసీ విభాగాలు, డిజిటల్ లైబ్రరీ వంటి వసతులున్నాయి. వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ తదితర వసతులను సమకూర్చారు. కళాశాల ప్రధాన ప్రవేశ ద్వారం వద్ద ఏర్పాటు చేసిన సరస్వతీ దేవీ విగ్రహం విద్యార్థుల్లో భక్తిబావం నింపుతోంది.


కళాశాలకు భూమిని విరాళంగా ఇచ్చిన కాసుగంటి నారాయణరావు

మహామహులకు నీడనిచ్చిన కల్పతరువు

కళాశాలలో వివిధ బ్యాచ్‌లో విద్యను అభ్యసించిన పలువురు విద్యార్థులు ప్రస్తుతం సమాజంలో వివిధ రంగాల్లో రాణిస్తున్నారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్ రమణ, మాజీ మంత్రులు గొడిసెల రాజేశంగౌడ్, సుద్దాల దేవయ్య ఈ కళాశాల విద్యార్థులే. హైకోర్టు జస్టిస్ పుల్ల కార్తిక్, శాతవాహన విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్సలర్ ఆచార్య కడారు వీరారెడ్డి, తెలుగు విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య భూమయ్యతో పాటు జయ ప్రకాశ్, హనుమాండ్ల భూమయ్య, మంగారి రాజేందర్, లక్ష్మణరావు, డాక్టర్ బి నరేందర్ రావు వంటి వారు విద్యారంగంలో సేవలు అందిస్తున్నారు. కళాశాలకు చెందిన పూర్వ విద్యార్థి అరిగెల అశోక్ ప్రస్తుతం కళాశాల ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్నారు.

జగిత్యాలకు తలమానికం


- డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే, కళాశాల పూర్వ విద్యార్థి

జగిత్యాల జిల్లాకు తలమానికంగా ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల నిలుస్తోంది. కళాశాలలో చదివిన ఎందరో విద్యార్థులు వివిధ రంగాల్లో మంచి మంచి హోదాల్లో స్థిరపడ్డారు. సమాజానికి పలువురు డాక్టర్లు, ఇంజనీర్లు, న్యాయవాదులు, ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలను అందించిన కళాశాల వజ్రోత్సవాలకు సిద్ధమవుతుండడం సంతోషకరం.

పేరు ప్రఖ్యాతులు గాంచిన కళాశాల ఎస్‌కేఎన్‌ఆర్


- ఎల్ రమణ, ఎమ్మెల్సీ, కళాశాల పూర్వ విద్యార్థి, జగిత్యాల

జగిత్యాల ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల ఉత్తర తెలంగాణ జిల్లాల్లో పేరు ప్రఖ్యాతులు గాంచింది. కళాశాలలో చదువుకున్న ఎందరో విద్యార్థులు ఉన్నత స్థానానికి చేరుకున్నారు. వజ్రోత్సవానికి సిద్దమవుతున్న సందర్భంగా పాత జ్ఞాపకాలు మదిలో మెదులుతున్నాయి.

వజ్రోత్సవ వేళ.. ప్రిన్సిపాల్‌గా.. పూర్వ విద్యార్థిగా..


- డాక్టర్ అరిగెల అశోక్, కళాశాల ప్రిన్సిపాల్, పూర్వ విద్యార్థి, జగిత్యాల

జగిత్యాల ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల వజ్రోత్సవాలను జరుపుకుంటున్న సందర్భంగా ఎన్నో అనుభవాలు గుర్తుకొస్తున్నాయి. కళాశాలలో చదివి ప్రస్తుతం ఇదే కళాశాలలో ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తుండడం సంతోషాన్ని అందిస్తోంది. వజ్రోత్సవాల సమయంలో ఒక వైపు ప్రిన్సిపాల్‌గా, మరో వైపు పూర్వ విద్యార్థిగా సేవలు అందించనుండడం అదృష్టంగా భావిస్తున్నాను.

గురుకులం నుంచి పారిపోయిన విద్యార్థి

- ఆరుగంటల అనంతరం తెలిసిన ఆచూకీ
- తల్లిదండ్రులకు అప్పగింత

ధర్మారం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ధర్మారం మండలంలోని మేడారం తెలంగాణ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల-కళాశాల నుంచి శనివారం ఉదయం విద్యార్థి గోడదూకి పారిపోయిన సంఘటన కలకలం రేపింది. ఆరు గంటల అనంతరం విద్యార్థి ఆచూకీ లభించడంతో కథసుఖాంతమైంది. వివరాలు ఇలా ఉన్నాయి. జగిత్యాల జిల్లాధర్మపురికి చెందిన ఇమ్మడి మెగావర్షిత్ రెసిడెన్షియల్ బాలుర కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శనివారం ఉదయం 4గంటల ప్రాంతంలో విద్యార్థులు స్నానాలు చేసేందుకు వాచ్‌మన్ మోటార్లు ఆన్ చేయడానికి వెళ్లాడు. ఈ సమయాన్ని అదునుగా భావించిన మెగావర్షిత్ గేట్‌పక్కన గోడదూకి పారిపోయాడు. 5గంటలకు విద్యార్థుల అటెండెన్స్ తీసుకుంటున్న క్రమంలో విద్యార్థి లేడనే విషయం ఉపాధ్యాయులకు తెలిసింది. విద్యార్థి పాఠశాల నుంచి పారిపోయాడనే విషయం తెలియడంతో ఉపాధ్యాయులతో పాటు విద్యార్థి కుటుంబసభ్యులు ఆందోళనకు గురయ్యారు. విద్యార్థి ఆచూకీ కోసం ప్రిన్సిపాల్ విద్యాసాగర్‌తోపాటు ఉపాధ్యాయులు ధర్మారం, పెద్దపల్లి, ధర్మపురి ప్రాంతాలలో వెతికారు. విద్యార్థి మిస్సింగ్ విషయం ప్రిన్సిపాల్ ధర్మారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు పాఠశాలలోని సీసీ కెమారాలు పరిశీలించారు. ఉదయం 4.20 ప్రాంతంలో మెగావర్షిత్ పాఠశాల నుంచి బ్యాగ్ వేసుకొని వెళుతున్న దృశ్యాలు సీసీ కెమరాలో రికార్డ్ అయ్యాయి. మేడారంలోని ఓ పెట్రోల్‌బంకు సమీపంలోని మామిడి తోటలోఉన్నాడు. వెంట తెచ్చుకున్న ఖర్జూర పండ్లతోపాటు బిస్కట్స్, చాక్లెట్స్, బ్రెడ్ తిని నీరు తాగేందుకు తోట నుంచి బయటకు వచ్చాడు. బోనాల సెలవుల నిమిత్తం ఇళ్లకు వెళ్తున్న అదే పాఠశాలకు చెందిన కొందరు విద్యార్థులు మెగా వర్షిత్‌ను గమనించి ప్రిన్సిపాల్‌కు సమాచారం ఇచ్చారు. ఉపాధ్యాయులు వెళ్లి విద్యార్థిని పాఠశాలకు తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎందుకు పారిపోయావని విద్యార్థిని అడగగా కుటుంబ సభ్యులను చూడాలనిపించిదని, రెండు రోజులు ఇంట్లో ఉండి వద్దామనుకున్నానని మెగా వర్షిత్ తెలిపాడు.

అనారోగ్యంతో వివాహిత బలవన్మరణం


జ్యోతి(ఫైల్)

తంగళ్లపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం గోపాల్‌రావ్‌పల్లె గ్రామానికి చెందిన కడారి జ్యోతి(40) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం ప్రకారం.. నెల రోజులుగా జ్యోతి కడుపునొప్పితో బాధపడుతుండగా ఆపరేషన్ చేయించారు. తిరిగి కడుపు నొప్పి వస్తుండడంతో ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి భర్త మల్లారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ ఉపేంద్రచారి తెలిపారు.

ఉరి వేసుకుని ట్రాన్స్‌జెండర్ ఆత్మహత్య

జగిత్యాల క్రైం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాకేంద్రంలోని తులసీనగర్‌లో అనారోగ్య కారణంతో శనివారం ఓ ట్రాన్స్‌జెండర్ ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ధర్మపురి పట్టణంలోని కాశెట్టివాడకు చెందిన తిరుమందాసు మనీంద్ర అలియాస్ అన్విక(25) అనేట్రాన్స్‌జెండర్ కొంత కాలంగా జగిత్యాల పట్టణంలోని తులసీనగర్‌లో నివసిస్తున్నాడు. అనారోగ్య కారణంతో తీవ్రమనస్థాపానికి గురై తన ఇంట్లో శనివారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని తండ్రి సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కరుణాకర్ పేర్కొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

తంగళ్లపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం పద్మనగర్‌కు చెందిన కుడిక్యాల సిద్ధిరాములు(73)అనే వృద్ధుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. సిద్ధిరామయ్యకు వృద్ధాప్యం కారణంగా తరచూ అనారోగ్యసమస్యలు తలెత్తుతున్నాయి. చికిత్స చేయిస్తున్నా తిరిగి వస్తుండడంతో మనస్థాపం చెంది శనివారం తెల్లవారుజామున ఇంటి ముందు రేకుల షెడ్డులో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య పదినెలల క్రితం మృతిచెందింది. ముగ్గురు కుమారులు ఉన్నారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

శంకరపట్నం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం వంకాయగూడెం గ్రామంలో శనివారం ప్రమాదవ శాత్తు విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందాడు. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వంకాయగూడెం గ్రామానికి చెందిన మూల రాకేష్(28) ఇంటి గోడను ఆనుకొని నిలుచున్నాడు. ఇంటిరేకుల షెడ్డుపై సర్వీస్ వైర్ ఉండడంతో కరెంట్ గోడకు ప్రవహించి విద్యుదాఘాతంతో మృతిచెందాడు. మృతుడి రాకేష్ భార్య మూల లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

మల్యాల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మల్యాల-పూడూర్ రైల్వే స్టేషన్ల మధ్య 60 ఏళ్ల లోపు గల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి రైలు ఢీకొని మృతిచెందాడు. సంఘటన స్థలాన్ని మల్యాల ఎస్సై నరేశ్‌కుమార్ పరిశీలించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో మంచిర్యాల జీఆర్‌పీ ఎస్సై మహేందర్ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు.

భార్యపై భర్త హత్యాయత్నం

కోల్‌సిటీ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ఎల్‌బీనగర్‌లో నివాసముండే జటోత శాంతి(37) అనేమహిళపై శనివారం ఆమె భర్త సర్వేష్ హత్యాయత్నంకు పాల్పడినట్టు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. సర్వేష్ మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడనే విషయంపై భార్య భర్తల మధ్య గొడవ జరిగిందని, దీంతో సర్వేష్ భార్యను హత్య చేయాలని ఆమె తలనుబలంగా గోడకు కొట్టడంతో గాయాలయ్యాయన్నారు. ఆమెను గోదావరిఖని ప్రభుత్వాసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. శాంతి ఫిర్యాదు మేరకు సర్వేష్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కోరుట్ల రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయిలాపూర్ గ్రామశివారులోని మామిడితోటలో పేకాటఅడుతున్న 9మందిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ చిరంజీవి శనివారం తెలిపారు. మామిడితోటలో పేకాట అడుతున్న సమాచారంతో దాడిచేసినట్లు ఎస్‌ఐ వివరించారు. వారివద్ద రూ.6,500 నగదు, 8ద్విచక్రవాహనాలు, 9సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

డీఎస్పీ మహేష్‌కు కన్నీటి వీడ్కోలు

- నివాళులర్పించిన సీపీ గౌస్ ఆలం, పోలీసులు

కరీంనగర్ క్రైం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో శుక్రవారం మరణించిన డీఎస్పీ మహేష్ అంత్యక్రియలు శనివారం పోలీసు లాంఛనాల ప్రకారం కరీంనగర్‌లోని సప్తగిరి కాలనీ శ్మశానవాటికలో జరిగాయి. ఈ అంత్యక్రియల్లో కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్‌ఆలం పాల్గొని, డీఎస్పీ మహేష్ పార్థివదేహంపై పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. దహనసంస్కారంకు ముందుగా సంతాపసూచకంగా పోలీసులు మూడు రౌండ్లు గాలిలోకి కాల్పులు జరిపారు. అడిషనల్ డీసీపీ (అడ్మిన్) వెంకటరమణ, అడిషనల్ డీసీపీ ఏఆర్ భీం రావుతోపాటు కమిషనరేట్‌కు చెందిన పలువురు పోలీస్ ఉన్నతాధికారులు, సిబ్బంది డీఎస్పీ మహేష్ భౌతికకాయానికి నివాళులర్పించిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో డీఎస్పీమహేష్ కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు పాల్గొన్నారు.


సంతాపసూచకంగా గాలిలోకి కాల్పులు జరుపుతున్న పోలీసులు

వరుసగా ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ

చిగురుమామిడి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో వరుసగా ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలు జరుగుతున్నాయి. వర్షాకాలం సీజన్‌లో వరినాట్లు వేసే సమయం కావడంతో రైతులకు నిత్యం కరెంటు అవసరం ఉంటుంది. తిరిగి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలంటే చాలా సమయం పడుతుంది. వేలాది రూపాయలు ఖర్చు అవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా ఇదేవిధంగా దొంగతనాలు జరిగిన సందర్భాలున్నాయని రైతులు పేర్కొంటున్నారు. రాత్రిళ్లు వ్యవసాయబావుల వద్దకు వెళ్లడానికి రైతులు జంకుతున్నారు. పోలీసులుగ్రామాల్లో గస్తీ తిరిగి దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

బైక్ చోరీ

గంభీరావుపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోళ్లమద్ది గ్రామంలో వేముల శ్రీధర్‌కు చెందిన బైక్‌ను శుక్రవారం రాత్రి దొంగలు ఎత్తుకెళ్లారు. శ్రీధర్ తనఇంటి ముందు శుక్రవారం రాత్రి పెట్టిన బైక్(టీజీ23 6155) మరుసటిరోజు ఉదయం లేచి చూసే సరికి లేదు. దీంతో పోలీస్‌స్టేషన్‌లో శ్రీధర్ ఫిర్యా దు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యా ప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మహిళల రక్షణకే షీ టీం

పెద్దపల్లి రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణ కోసం షీటీం పని చేస్తుందని షీటీం సభ్యురాలు స్నేహలత అన్నారు. శనివారం పెద్దకల్వల నోబెల్ పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్నేహలత మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, యాంటిడ్రగ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మహిళల రక్షణ కోసం బస్టాండ్, ప్రధాన చౌరస్తాలతో పాటు జనం రద్దీగా ఉండే ప్రాంతాల్లో కళాశాలల వద్ద షీటీం నిరంతరంగా నిఘా పెడుతుం దని, ఎవరైనా వేధింపులకు గురిచేస్తే 6303923700 నంబర్‌కు ఫోన్‌చేసి సమా చారం అందించాలన్నారు. కరస్పాండెంట్ మోహన్‌రాజ్, ప్రధానోపాధ్యాయులు ప్రణీత, షీ టీం సభ్యులు మౌనిక, సురేష్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న షీ టీం సభ్యురాలు స్నేహలత

పైకప్పు పెచ్చులు ఊడి విద్యార్థికి గాయాలు

గంభీరావుపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని బాలుర ఎస్సీ హాస్టల్‌లో శనివారం పైకప్పు పెచ్చులు ఊడి ఓవిద్యార్థికి గాయాలయ్యాయి. ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామానికిచెందిన మండాటి సన్విత్ అనే 8వ తరగతి విద్యార్థిహాస్టల్‌లో స్నానం చేస్తుండగా పైకప్పు పెచ్చులు ఊడి తలపై పడ్డాయి. విద్యార్థి తలకుగాయాలు కావడంతో బంధువులువచ్చి, ఆసుపత్రికి తీసుకెళ్లారు. తల వెనుకభాగంలో రక్తస్రావం కావడంతో వైద్యులు చికిత్స చేసి ఇంటికి పంపించారు. ఈవిషయమై ఇన్‌చార్జి వార్డెన్ బూదమ్మను అడగగా హాస్టల్ భవనం పాతది కావడంతో పైకప్పు పెచ్చులు ఊడి ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు.

అంతర్రాష్ట్ర సైబర్ నేరస్థుడి అరెస్ట్

- క్రెడిట్ కార్డు యాక్టివేషన్ పేరుతో సైబర్ మోసాలు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ మహేష్ బి గీతే


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ మహేష్ బీ గీతే

సిరిసిల్ల క్రైం జూలై 19 (ఆంధ్రజ్యోతి): క్రెడిట్ కార్డు యాక్టివేషన్ పేరుతో సైబర్ మోసాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర నేరస్థుడిని అరెస్టు చేసినట్లు ఎస్పీ మహేష్ బి గీతే తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. హైదరాబాద్ చింతల్ ప్రాంతానికిచెందిన మహమ్మద్ ఖలీం పాషా, రషీద్ అనేఇద్దరు చెడువ్యసనాలకు బానిసలై సులువుగా డబ్బులు సంపాదించాలని, కలకత్తాలో తమకు పరిచయం ఉన్న అంకిత్ అనేవ్యక్తి దగ్గర ఆన్లైన్ మోసాలు ఎలా చేయాలో నేర్చుకున్నారు. అంకిత్ ఆర్బీఎల్ క్రెడిట్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారివివరాలు ఖలీం, రషీద్‌లకు పంపగా, వారు కస్టమర్‌కేర్ నుంచి మాట్లాడినట్లు నమ్మించి బాధితులకు ఏపీకే లింక్ పంపేవారు. వారు పంపిన ఏపీకే లింకును బాధితులు క్లిక్ చేసిన ఇన్‌స్టాల్ చయడంతో అంకిత్ వారి ఫోన్లను హ్యాక్ చేసి, క్షణాల్లో బాధితుల క్రెడిట్ కార్డులోని డబ్బులతో ఈ-కామర్స్ ద్వారా కొనుగోలు జరిపేవాడు. అంకిత్ చెప్పినట్లు చేసినందుకు ఖలీం, రషీద్ ఇద్దరికీ లక్షకు రూ.2500 చొప్పున గుర్తు తెలియని వ్యక్తుల పేరిట రాపిడో కొరియర్ ద్వారా డబ్బులు పంపేవాడు. అంకిత్ వీరిద్దరితో వాట్సాప్‌ద్వారా మాత్రమే మాట్లాడేవాడు. ఈక్రమంలో సిరిసిల్లకు చెందిన సురేష్ అనే వ్యక్తి నిందితుల చేతిలో మోసపోయి, సిరిసిల్లపట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేసిన పోలీసులు సాంకేతికత ఆధారంగా హైదరాబాదులో ఖలీం పాషాను అరెస్టుచేశారు. నిందితుడివద్ద నుంచి కారు, ఆరు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై దేశవ్యాప్తంగా ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌లో 60ఫిర్యాదులు వచ్చాయని, అలాగే నిందితులు సుమారు రూ.50 లక్షల మోసాలకు పాల్పడ్డారని ఎస్పీ తెలిపారు. పరారీలో ఉన్న మరోఇద్దరి నిందితులను త్వరలో పట్టుకుంటామన్నారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించి నిందితుడిని పట్టుకున్న సైబర్ ఆర్ఎస్ఐ జునైద్, సిబ్బంది గంగారెడ్డి, కిట్టు, మహేష్, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌లను అభినందించారు.

యువకుడి హత్య కేసు నిందితుల అరెస్ట్

- వివరాలు వెల్లడించిన డీఎస్పీ రఘుచందర్

వెల్గటూర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్‌లో కొద్దిరోజుల క్రితం జరిగిన సల్లూరి మల్లేష్(26) హత్య కేసులో ముగ్గురు నిందితులు నైనాల రాజిరెడ్డి, నైనాల మల్లారెడ్డి, చింతల హరీష్‌ను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. హత్యకేసు వివరాలను జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ శనివారం వెల్లడించారు. నిందితుడు నైనాల రాజిరెడ్డి కుమార్తెను కిషన్‌రావుపేటకు చెందిన సల్లూరి మల్లేష్ ప్రేమపేరుతో కొంతకాలంగా వేధిస్తున్నాడు. దీంతో నిందితులు వెల్గటూర్ పోలీస్ స్టేషన్‌లో గతంలో సల్లూరి మల్లేష్‌పై పలు కేసులు పెట్టారు. మృతుడిపై రౌడీషీట్ ఓపెన్ అయిందన్నారు. మృతుడు మల్లేష్‌కూడా రాజిరెడ్డి, మల్లారెడ్డిపై ఎస్సీ ఎస్టీ కేసుపెట్టగా వారు రిమాండ్‌కు వెళ్లి వచ్చారన్నారు. మూడు సంవత్సరాలుగా ఇరువురిమధ్య ఈ విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈనెల 17న ఉదయం మల్లేష్ నైనాల రాజిరెడ్డి ఇంటికి వెళ్లి అతని కుమార్తె ఇంటిలో ఒంటరిగా ఉన్న సమయంలో బెదిరించి, తనతో రావాలని బలవంతం చేశాడు. ఆమె నిరాకరించగా, ఇంటిపై రాళ్లు విసిరాడు. వెంటనే ఆమె లక్షెట్టిపేటలో ఉన్న తనతండ్రికి ఫోన్ ద్వారా విషయం తెలిపింది. నైనాల రాజిరెడ్డి, అతడి తమ్ముడు నైనాల మల్లారెడ్డి, కొత్తపేటకు చెందిన చింతల హరీష్‌తో కలిసి కిషన్‌రావుపేట వచ్చారు. ముగ్గురు కలిసి మొదటమల్లేష్‌పై ఫిర్యాదు చేయడానికి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. రాజిరెడ్డి తన కూతురును, పాత కేసు పత్రాలు తీసుకు వస్తానని చెప్పి వెనుకాల ఆటోలో వెళ్లాడన్నారు. ముందుగా వెళ్లిన మల్లారెడ్డి, హరీష్‌కు వెల్గటూర్ సమీపంలో బ్రిడ్జివద్ద మల్లేష్ ద్విచక్రవాహనంపై కనిపించగా ఆపి కొట్టారు. అనంతరం ఈ విషయం రాజిరెడ్డికి ఫోన్‌ద్వారా వారు తెలపగా రాజిరెడ్డి వెంటనే ఆటోలో అక్కడికి చేరుకుని మృతుడిపై దాడిచేశాడు. గమనించిన కొందరువారిని ఆపే ప్రయత్నం చేశారు. దీంతో వారు మల్లేష్‌ను పోలీస్‌స్టేషన్‌కు తీసుకు వెళ్తామనిచెప్పి బలవంతంగా రాజిరెడ్డి ఆటోలో ఎక్కించారు. అనంతరం కోటిలింగాల రోడ్డులో ఉన్న పాతవైన్స్ వెనుక ఆటోనుఆపి రాజిరెడ్డి కత్తితో మల్లేష్‌ను పొడిచాడు. మల్లేష్ మృతిచెందినట్లు నిర్ధారించుకొని నిందితులు ముగ్గురు అక్కడినుంచి పారిపోయారన్నారు. నిందితులు హత్యకు ఉపయో గించిన కత్తి, ఆటో, దుస్తులు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. విలేకరుల సమావేశంలో సీఐరాంనర్సింహారెడ్డి, ఎస్సైఉమాసాగర్ ఉన్నారు.



హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రఘుచందర్

అదుపుతప్పి లారీ బోల్తా

హుజూరాబాద్‌రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగాపూర్ గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి బూడిద లోడుతో వస్తున్న లారీ బోల్తాపడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ నుంచి హుజూరాబాద్ వస్తున్న ఆటోను బూడిద లారీ వెనుక నుంచి వేగంగా వచ్చి ఢీకొట్టి అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తాపడింది. లారీడ్రైవర్ నిద్ర మత్తు కారణం గానే ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు.


బోల్తాపడిన లారీ

బీఈడీ, ఎల్ఎల్బీ పరీక్ష ఫీజు షెడ్యూల్ విడుదల

గణేశ్‌నగర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ విభాగంలో బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (బీఈడీ), మాస్టర్ ఎడ్యుకేషన్ (ఎంఈడీ), ఎల్ఎల్బి (న్యాయ) కోర్సుల్లో రెండో, నాలుగోసెమిస్టర్ పరీక్షల ఫీజు షెడ్యూల్‌ను శాతవాహన విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ బి సురేష్‌కుమార్ శనివారం విడుదల చేశారు. పరీక్షలు ఆగస్టు 2025లో జరుగుతాయని తెలిపారు. పరీక్ష రుసుమును ఎటువంటి అపరాధ రుసుము లేకుండా 29-07-2025 వరకు చెల్లించాలని 300రూపాయల అపరాధ రుసుముతో 01-08-2025వరకు ఆన్‌లోన్‌లో చెల్లించవలసిందిగా తెలిపారు. వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో చూడాలని, లేదా ఆయాకళాశాలలో సంప్రదించాలని కోరారు. అన్ని పోస్ట్‌గ్రాడ్యుయేట్, ఎంబీఏ, ఎంసీఏ పరీక్షలు 29-07-2025 నుంచి 01–8-2025 వరకు జరుగుతాయని విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు.

నేడు బాలాలయం నిర్మాణానికి శంకుస్థాపన

వేములవాడ కల్చరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధిలో భాగంగా స్థానిక బీమేశ్వరస్వామి ఆలయంలో బాలాలయం నిర్మాణానికి ఆదివారం ఉదయం 10 గంటలకు కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝాతో కలిసి ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ శంకుస్థాపన చేయనున్నట్లు ఈవో ఒక ప్రకటనలో తెలిపారు. దర్శనాల కోసం ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా క్యూలైన్‌లు, కల్యాణం, అభిషేక సంకల్ప పూజల కోసం షెడ్ల నిర్మాణ పనులను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

ఊరిని మార్చిన మల్లన్న స్వామి

ఆదివారం ప్రత్యేకం





ఆదివారం మద్యం, మాంసం బంద్



- ప్రతీ సంవత్సరం హోలీ తర్వాత పెద్దాపూర్‌లో బోనాల జాతర
- వివిధ రాష్ట్రాల నుంచి లక్షల్లో భక్తుల రాక

పెద్దాపూర్‌లోని మల్లన్నస్వామి దేవాలయం

మెట్‌పల్లి రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సెలవుదినమైన ఆదివారం వచ్చిందంటే చాలు మాంసాహార ప్రియులు చికెన్, మటన్, చేపలు ఇలా ఎవరికి ఇష్టం వచ్చింది వాళ్లు ఇంటికి తెచ్చుకుంటూ ఉంటారు. గ్రామాల్లో ఉదయం నుంచే కల్లు తాగే ప్రియులతో ఈత, తాటి వనాల్లో సందడి నెలకొంటుంది. కానీ జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో మాత్రం ప్రతీ ఆదివారం మద్యం, మాంసానికి దూరంగా ఉంటారు. దీనికి కారణం ఆ గ్రామంలో వెలిసిన మల్లికార్జున స్వామి భక్తులు కోరిన కోర్కెలు తీరుస్తాడని వారి నమ్మకం. దీంతో పదిహేనేళ్లుగా గ్రామస్థులు ప్రతి ఏటా హోలీ పండగ తరువాత మొదటి ఆదివారం బోనాల జాతర నిర్వహిస్తున్నారు. దీనికి యేటా లక్షకు పైగా భక్తులు తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రల నుంచి తరలివస్తున్నారు.

● ఉత్తర తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన దేవాలయం...

సుమారు వందేళ్ల క్రితం పెద్దాపూర్ గ్రామంలో మల్లన్న స్వామి వెలిశాడని పూర్వీకులు చెబుతారు. తొలిరోజుల్లో యాదవులు మాత్రమే స్వామికి పూజలు చేసేవారు. కొన్నాళ్లకు ఊరి వాళ్లంతా మల్లన్న స్వామిని తమ ఇలవే ల్పుగా కొలవడం ప్రారంభించారు. సంతానం, పెళ్లి, వ్యాపారం, ఇల్లు ఇలా ఏది కోరుకుని స్వా మికి మొక్కుకున్నా నెరవేరుతుందనేది భక్తుల నమ్మకం. భక్తులు తమ కోరికలు తీరినప్పుడల్లా ఇక్కడికి వచ్చి మల్లన్న స్వామికి మొక్కులు చెల్లించుకుంటారు. ప్రారంభంలో చిన్న పూరి గుడిసెతో ఉన్న ఆలయానికి క్రమంగా స్వామి వారి భక్తుల రాక పెరిగింది. స్వామి వారికి వచ్చే కానుకలు, ఆలయానికి వచ్చే భక్తుల సహకారంతో గ్రామస్థులంతా ఒక్కటై గర్భగుడిని నిర్మించారు. ప్రతీ సంవత్సరం హోలీ పండగ తరువాత మొదటి ఆదివారం బోనాల జాతర నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది. ముందుగా శనివారం స్వామి వారిని గోదావరి నదికి తీసుకెళ్లి పుణ్యస్నానాలు చేయించిన అనంతరం గ్రామానికి తీసుకొచ్చి రాత్రి కల్యాణం వైభవంగా జరుపుతారు. ప్రతీ సంవత్సరం మల్లన్న స్వామిని దర్శించుకొని బోనాలు సమర్పించడానికి మన రాష్ట్రం నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి లక్షకు పైగా భక్తులు తరలి వస్తారు. మల్లన్న స్వామికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. అనంతరం శివ సత్తులు, పోతురాజుల పూనకాలు, ఒగ్గు కళాకారుల విన్యాసాల మధ్య రథోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహిస్తారు.

● 15 ఏళ్లుగా నిష్ఠతో పూజలు

మల్లన్న స్వామికి ఆదివారం ప్రీతికరమైనదిగా బావించే పెద్దాపూర్ ఊరి గ్రామస్థులు ఆ రోజు ప్రత్యేక పూజలు చేస్తారు. స్వామి ఊళ్లో స్వయంభువుగా కొలువుదీరి తమను చల్లగా కాపాడుతున్నాడని గ్రామస్థుల నమ్మకం. దీంతో గ్రామస్థులంతా ఏకమై ఆదివారం నాడు మందు ముట్టకుండా, మాంసం తినకుండా ఉండాలని 15 సంవత్సరాల క్రితం తీర్మానం చేసుకొని ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం గ్రా మంలో సుమారు 300లకు పైగా కుటుంబాలు, వెయ్యికి పైగా జనాభా ఉంది. మల్లన్నస్వామికి ఇష్టమైన ఆదివారం రోజు భక్తులు నిష్ఠతో ఉండి ప్రత్యేక పూజలు చేస్తుంటారు. గ్రామంలో ఆదివారం పిల్లాపాపలతో కలిసి మల్లన్నస్వామి ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు చేస్తారు. ఆదివారం మద్యానికి, మాంసానికి దూరంగా ఉంటూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.



పెద్దాపూర్‌లోని మల్లన్నస్వామి ఆలయంలోని ఉత్సవమూర్తులు

భక్తుల కొంగు బంగారం



మల్లన్న స్వామికి ఆదివారం ప్రీతికరమైనదిగా భావించి మాంసం తినడం, మందు తాగడం పదిహేనేళ్ల నుంచి మానేశాం. ప్రతి ఏటా నిర్వహించే జాతరకు లక్షకు పైగా భక్తులు వచ్చి మల్లన్న స్వామిని దర్శించుకుంటారు. ముఖ్యంగా పెళ్లి కాని వారు, సంతానం లేని వారు ఇక్కడికి వచ్చి స్వామి వారిని మొక్కుకుంటారు. 15 ఏళ్ల నుంచి గ్రామంలో మందు, మాంసం తినకూడదని ఆచారంగా పెట్టుకున్నాం.

-మిట్టపల్లి నారాయణరెడ్డి, పెద్దాపూర్ గ్రామస్థుడు

మహా సుదర్శన, రాజశ్యామల మహోత్సవాలకు ఏర్పాట్లు

- ఖనిలో మూడు రోజుల పాటు యాగాలు, హోమాలు
- హాజరుకానున్న మంత్రులు, పీఠాధిపతులు, నాగ సాధువులు, స్వామిజీలు

కోల్‌సిటీ టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలో ఆధ్యాత్మికశోభ సంతరించుకోనున్నది. లోక కల్యాణార్థం, మానవాళి క్షేమం కోరుతూ రాష్ట్రీయ సాధుసంరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు, రాజశ్యామలదేవి ఉపాసకుడు తూడి శ్రావణ్‌కుమారస్వామిజీ ఆధ్వర్యంలో జీఎం ఆఫీస్ సమీపంలోని సత్యసాయి మందిరంలో మహాసుదర్శన, రాజశ్యామలదేవి త్రయాహ్నిక యజ్ఞమహోత్సవాలు సోమవారం నుంచి జరుగనున్నాయి. ఇందుకోసం సత్యసాయి మందిరం ప్రాంగణంలో ఏర్పాట్లు చేస్తున్నారు. యాగాలు, హోమాలు, ఇతరత్ర క్రతువుల కోసం సిద్ధం చేస్తున్నారు. మూడురోజులపాటు జరిగే మహోత్సవాలలో సోమవారం ఉదయం 6గంటల నుంచి మహాగణాధిపతి పూజ, స్వస్తి పుణ్యాహవచనం, దీక్షాకంకణ ధారణలు, రుద్రహోమం, 22నమంగళవారం మండప పూజలు, మహా సుదర్శన యాగం, మంత్ర పుష్పం, కుంకుమార్చన, 23న రాజశ్యామల దేవియాగం, ప్రత్యంగిరి, వారాహి దేవి హోమాలు, పూర్ణాహుతి, కార్యక్రమాలు జరుగనున్నాయి.

మహోత్సవాలకు మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, గడ్డం వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, చింతకుంట విజయరమణారావు, ఎంపీ వంశీకృష్ణ, జిల్లా అధికారులు పాల్గొన నున్నారు. పలువురు పీఠాధిపతులు, స్వాములు, నాగ సాధువులు పాల్గొననున్నారు.



మందిరం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

స్వచ్ఛ్ సర్వేక్షణ్‌లో జమ్మికుంటకు 17వ ర్యాంక్

జమ్మికుంట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మున్సిపాల్టీ స్వచ్ఛ్ సర్వేక్షణ్‌లో రాష్ట్రంలో 17వ ర్యాంక్ సాధించింది. ఇంటిపన్నుల వసూళ్లలో రెండు ఆర్థికసంవత్సరాలు రాష్ట్రంలో ప్రథమస్థానంలో నిలిచింది. సీడీఎంఏ శ్రీదేవి ఫోన్‌లో మున్సిపల్‌కమిషనర్ మహమ్మద్ ఆయాజ్, అధికారులు, సిబ్బందిని అభినందించించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 2023ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో 92వ స్థానం, దేశంలో 1216స్థానం, 2024ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో 17వస్థానం, దేశంలో 217స్థానంలో నిలవడం సంతోషంగా ఉందన్నారు. స్వచ్ఛ్ సర్వేక్షణ్‌లో 17వ స్థానంలో జమ్మికుంట మున్సిపాల్టీ నిలిచేందుకు కష్టపడ్డ ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.



మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్

తహసీల్దార్ కార్యాలయం ఎదుట
దంపతుల భిక్షాటన

- అధికారులు పట్టించుకోవడం లేదని నిరసన

వేములవాడ టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ తహసీల్దార్ కార్యాలయం ఎదుట పట్టణానికి చెందిన అక్షయ్-మమత అనే దంపతులు శనివారం భిక్షాటన చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. మూడు నెలలుగా రేషన్‌కార్డు కోసం తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అధికారుల వైఖరిని నిరసిస్తూ భిక్షాటన చేస్తున్నట్లు తెలిపారు. ఈ సంఘటనపై స్థానికతహసీల్దార్‌ను వివరణ కోరగా కార్యాలయానికి రేషన్‌కార్డు కోసం వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరిస్తున్నామని, దరఖాస్తులు ఏమీ పెండింగ్‌లో లేవని తెలిపారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట భిక్షాటన చేస్తున్న దంపతులు

ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో చొక్కారావు చిరస్మరణీయుడు

- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



చొక్కారావు విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కరీంనగర్ అర్బన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయాల్లో మాజీమంత్రి జువ్వాడి చొక్కారావు చిరస్మరణీయుడని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం మాజీమంత్రి చొక్కారావు జయంతి సందర్భంగా కరీంనగర్‌లో అయన విగ్రహానికి మంత్రి పొన్నం ప్రభాకర్‌తోపాటు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నివాళులర్పించారు. చొక్కారావుతో ఉన్న స్మృతులను గుర్తుకు చేసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తెలంగాణ రీజనల్ కమిటీ చైర్మన్‌గా, ఎంపీగా, మూడు దఫాలు మంత్రిగా, జిల్లాపరిషత్ చైర్మన్‌గా రాజకీయాల్లో చొక్కారావు అందరూ ఆదర్శంగా తీసుకోవాల్సిన నేతగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ బ్యాంకు చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆకారపు భాస్కర్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నరెడ్డి, మాజీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సమీక్షా సమావేశం



సమావేశమైన పబ్లిక్ ప్రాసిక్యూటర్లు

కరీంనగర్ లీగల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఆదేశాలపై డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ డి శరత్ ఆధ్వర్యంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సమీక్షా సమావేశం శనివారం జిల్లా కోర్టు ఆవరణలో నిర్వమించారు. ఈ సందర్భంగా శరత్ మాట్లాడుతూ ప్రాసిక్యూటర్లు న్యాయమూర్తుల, న్యాయవాదుల సమన్వయంతో ముందుకెళ్లాలని, కొత్త చట్టాలపై పూర్తి అవగాహన కలిగిఉండాలని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో క్రిమినల్ కేసుల్లో నిందితులకు శిక్షలుపడ్డ కేసులసంఖ్య పెరిగిందని, దాన్ని కొనసాగించేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రాసిక్యూటర్ల సమీక్షా సమావేశాలకు విధిగా హాజరుకావాలని తెలిపారు. ఈ సందర్భంగా ప్రాసిక్యూటర్ల సమస్యలు ఆయన అడిగితెలుసుకున్నారు. అనంతరం జగిత్యాల ఏపీపీరాజేశ్ ఎస్సీఎస్టీ చట్టం గురించి వివరించారు. సమావేశంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు మల్లికార్జున్, చీటి రామకృష్ణారావు, మల్యాల ప్రతాప్, ఆరెల్లి రాములు, లక్ష్మీప్రసాద్, జూలూరు శ్రీరాములు, కుమార్‌గౌడ్, గౌరు రాజిరెడ్డి, గడ్డం లక్ష్మణ్, పెంట శ్రీనివాస్, ఝాన్సీ, మల్లేశం, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి కేసు విచారణలో
బయటపడిన హత్యోదంతం

- రెండేళ్ల క్రితం ఘటన ● పోలీసుల దర్యాప్తు

మల్యాల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తీగ లాగితే డొంక కదిలింది. గంజాయి కేసులో పట్టుబడిన వారిని విచారిస్తుండగా రెండేళ్ల క్రితం జరిగిన హత్య కేసు బయటపడింది. ప్రస్తుతం నిందితులు గంజాయి కేసులో రిమాండ్‌లో ఉండగా మల్యాల పోలీసులు హత్య కేసు దర్యాప్తు చేపట్టారు. మల్యాల సీఐ నీలంరవి, ఎస్సై నరేశ్‌కుమార్ తెలి పిన వివరాల ప్రకారం 2023 మార్చిలో కొండగట్టు టేకు ప్లాంటేషన్ సమీపంలో మెట్‌పల్లికిచెందిన సింగంనడిపి గంగాధర్ (40) అనేవ్యక్తి మృతదేహం కాలిబూడిద అయిన ఘటనలో అప్పుడు పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఇటీవల మెట్‌పల్లిలో గంజాయితో ముగ్గురు వ్యక్తు లను అక్కడి పోలీసులు పట్టుకొని విచా రణ జరిపారు. విచారణ చేస్తున్న క్రమం లో గంగాధర్‌ను కొండగట్టుకు తీసుకువచ్చి హత్యకు పాల్పడినట్లు నిందితులు ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం గంజాయికేసులో ముగ్గురువ్యక్తులు జైలు లో ఉన్నందున త్వరలోనే వారిని విచారిం చనున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. గంగా ధర్ అనేవ్యక్తి హత్యకు సంబంధించిన పూర్తి వివరాలు కేసుదర్యాప్తులో తెలుస్తా యని పోలీసులు పేర్కొన్నారు.

హామీల అమలుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్న ప్రభుత్వం

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గజ్జెల కాంతం

కరీంనగర్ అర్బన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ప్రజలకిచ్చిన హామీల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గజ్జల కాంతం అన్నారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా నియమితులై మొదటిసారి జిల్లా కేంద్రానికి వచ్చిన గజ్జెల కాంతంకు శనివారం జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ఎన్టీఆర్ విగ్రహం వద్ద గజ్జెల కాంతంను ఆహ్వానించి శాలువాలతో సత్కరించారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి డీసీసీ కార్యాలయం వరకు ర్యాలీగా చేరుకున్న గజ్జెల కాంతం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తోందన్నారు. ఎస్సీ వర్గీకరణ చేసి చరిత్ర సృష్టించడమే కాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించేందుకు చేస్తున్న కృషిని యావత్ తెలంగాణ ప్రజానీకం అభినందిస్తోందన్నారు. దశాబ్దకాలంగా ప్రజలు ఎదురుచూస్తున్న కొత్త రేషన్ కార్డులను రాష్ట్రవ్యాప్తంగా మంజూరు చేస్తోందని తెలిపారు. కమీషన్ల కోసమే ప్రాజెక్టులు నిర్మించి 80 వేల కోట్లు దోచుకున్న వారు త్వరలోనే జైలుకు వెళ్లడం ఖాయమన్నారు.

సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, మార్కెట్ మాజీ చైర్మన్ ఆకార భాస్కర్ రెడ్డి, కాంగ్రెస్ నేతలు ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొరివి అరుణ్‌కుమార్, లింగంపల్లి బాబు, సముద్రాల అజయ్, బాలబద్రి శంకర్, బొబ్బిలి విక్టర్, అస్తపురం రమేష్, స్వరూప తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గజ్జెల కాంతం

బాధ్యులపై చర్యలేవి?

- గర్భిణికి కాలం చెల్లిన మందులిచ్చిన సిబ్బంది
- ప్రాథమిక విచారణ కూడా జరపని అధికారులు

జమ్మికుంట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కాలం చెల్లిన మందులు వాడడం వల్ల ఓ గర్భిణికి రియాక్షన్ అయ్యింది. ఈ సంఘటన వెలుగుచూసి వారం రోజులు గడిచినా వైద్యశాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టణ పరిధిలోని గణేష్‌నగర్‌కు చెందిన కావ్య అనే గర్భిణి గతనెల30న వైద్య పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లింది. వైద్యుడు పరీక్షలు చేసి మందులు రాసి ఇచ్చాడు. ఫార్మసిస్ట్ విభాగానికివెళ్లిన కావ్య మందులు తీసుకుని ఇంటికి వెళ్లింది. మందులు వాడడం ప్రారంభించిన నాటి నుంచి ముఖంపై దద్దుర్లు రావడం మొదలయ్యాయి. మొదట స్కిన్ ఎలర్జీ అనుకున్నా రోజురోజుకూ పెరుగుతూ వచ్చాయి. ఈ నెల 10న మళ్లీ వైద్య పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చింది. వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు మళ్లీ మందులురాసి ఇవ్వడంతో ఫార్మసీలో తీసుకుని ఇంటికి వెళ్లింది. దద్దుర్లు తగ్గక పోవడంతో హైదరాబాద్‌లో ఉంటున్న తనభర్త హరీష్‌కు చెప్పింది. 13న జమ్మికుంటకు వచ్చిన హరీష్ ఇంటికి వెళ్లి మందులను పరిశీలించాడు. వాటిలో ఎక్స్‌పైరీ ముగిసిన మందులను గుర్తించాడు. ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్యు డిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. కాలం చెల్లిన మందులు ఎలా వచ్చాయో తమకు అర్థం కావడం లేదని, అయినా వాటితో రియాక్షన్ కాదని వైద్యులు సమాధానం ఇచ్చారు. కాలం చెల్లిన మందులతో ఏం కాదని ఎలా అంటారంటూ వైద్యుల తీరుపై మండిపడ్డారు. స్పందించిన సూపరింటెండెంట్ శ్రీకాంత్‌రెడ్డి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. వారంరోజులు గడిచినావైద్యశాఖ ఉన్నతాధికారులు ప్రాథమికవిచారణ కూడా చేపట్టక పోవడం విమర్శలకు తావిస్తోంది.



కాలం చెల్లిన ట్యాబ్లెట్స్ (ఫైల్)



కాలం చెల్లిన మందులను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ శ్రీకాంత్‌రెడ్డి (ఫైల్)

యమధర్మరాజు ఆలయంలో ప్రత్యేక పూజలు



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మపురి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని శ్రీలక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ యమధర్మరాజు ఆలయంలో శనివారం స్వామి వారలకు అభిషేకం, ప్రత్యేకపూజలు నిర్వహించారు. భరణి నక్షత్రం సందర్భంగా ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు నేరెళ్ల వంశీకృష్ణ స్వామి వారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ధర్మకర్తలు ఒజ్జల సౌజన్య-నరేందర్, ఏదులాపురం మహేందర్, రాపర్తి సాయికుమార్, బొల్లారపు పోచయ్య, స్తంభంకాడి గణేష్, నేదునూరి శ్రీధర్, కొమిరెల్లి పవన్‌కుమార్, అర్చకులు ఒద్దిపర్తి కళ్యాణ్‌కుమార్, ప్రదీప్‌కుమార్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

కొండగట్టులో భక్తుల సందడి

మల్యాల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి వారి సన్నిధానం శనివారం భక్తులతో సందడిగామారింది. వేలాదిగావచ్చిన అంజన్నను దర్శించుకుని మొక్కులుతీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు జరిపారు. భక్తులు అంజన్నతోపాటు బేతాళుడు, శ్రీరాములవారిని దర్శించకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు పర్యవేక్షించారు.

● 23న హుండీల లెక్కింపు

ఈనెల23న ఆంజనేయస్వామి దేవస్థానం హుండీలను లెక్కింపు చేపట్టనున్నట్లు ఈవోశ్రీకాంత్‌రావు తెలిపారు. నెలరోజులలో భక్తులు మొక్కుల రూపేణ సమర్పించుకున్న కానుకలు,నగదు లెక్కిస్తామని పేర్కొన్నారు.



ఆలయంలో భక్తుల మొక్కులు

వనమహోత్సవంలో ప్రతీ ఒక్కరు మొక్కలను నాటాలి

సిరిసిల్ల రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవంలో ప్రతీ ఒక్కరు మొక్కలను నాటి సంరక్షించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చెన్నమనేని కమలాకర్‌రావు కోరారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ గ్రామంలో శనివారం వనమహోత్సవంలో భాగంగా మొక్కలను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాకం రమేష్, వార్డు ఇన్‌చార్జ్ రెడ్డిమల్ల సుమన్, సల్లూరి శంకర్, కాసారం ఎల్లయ్య, బెజ్జారం శేఖర్, సిరికోటి తిరుపతి, తిమ్మనగరం శ్రీనివాస్ పాల్గొన్నారు.

తపాలా కార్యాలయాన్ని సందర్శించిన విద్యార్థులు

ఇల్లంతకుంట, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాల విద్యార్థులు శనివారం తపాల కార్యాలయాన్ని సందర్శించారు. పాఠశాలలో నోబ్యాగ్‌డే సందర్భంగా పోస్టాఫీస్‌కు వెళ్ళగా సబ్‌పోస్టు మాస్టర్ కుమారస్వామి విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు పొదుపు ఖాతాలు తీసుకవచ్చని, చిన్ననాటి నుండి పొదుపు చేయడం నేర్చుకోవాలన్నారు. ఉత్తర ప్రత్యుత్తరాల పంపిణీ, డిపాజిట్లు, జీవితబీమాలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ప్రేమలతతో పాటు ఉపాధ్యాయులు, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాలను తనిఖీ చేసిన ఎంవీఐ

ఇల్లంతకుంట, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో వాహనాలను ఎంవీఓ వంశీధర్ శనివారం తనిఖీలు చేశారు. సరైన ధ్రువీకరణ పత్రాలను లేని వాహనాలను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వాహనదారులు తప్పనిసరిగా రోడ్డుభద్రతా నియమాలను పాటించాలని, గడువు మీరిన వాహనాలను రోడ్డుపై తిప్పవద్దన్నారు. తనిఖీలలో ఎల్లేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల అవగాహనా రాహిత్యం..

ఎల్లారెడ్డిపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : బీఆర్‌ఎస్ హయంలో నిర్మించిన కల్వర్టు నాణ్యత లేక కూలిపోయిందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించడం వారి అవగాహన రహిత్యానికి నిదర్శనమని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు, సెస్ డైరెక్టర్ కృష్ణహరి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సత్సంగ సదనం-కోరుట్లపేట మధ్య కూలిపోయిన కల్వర్టును స్థానిక నాయకులతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణహరి మాట్లాడుతూ 23 ఏళ్ల కిందట నిర్మించిన కల్వర్టు కూలిపోతే ప్రజల ఆదారాభిమానాలు చూరగొట్టున్న బీఆర్‌ఎస్‌పై నింద వేయడం సరి కాదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్ల ఉన్న వ్యతిరేకతను అనుకూలంగా మార్చుకోవడానికి ఆ పార్టీ నాయకులు ప్రయత్నిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. పదేళ్ల అధికార దాహంతో ఉన్న ఆ పార్టీ నాయకులు అవకాశం చిక్కిన చోటల్లా పైసలు దండుకుంటున్నారని ఆరోపించారు. రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం తప్పదని కృష్ణహరి హెచ్చరించారు. కార్యక్రమంలో తాజా, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, నాయకులు సుభాష్, సందీప్, పర్శరాములు, నర్సింలు, శ్రీనివాస్, అజిమోద్దిన్, వెంకట్‌రెడ్డి, బాల్‌రెడ్డి, రమేశ్, బాలాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సహకారం..



ప్రొజెక్టర్‌ను అందిస్తున్న సంస్థ నిర్వాహకులు

సిరిసిల్ల రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల చదువుకోసం ఎలాంటి సహకారమైన అందిస్తామని సహాయ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు శ్రీరామోజు వేణు, కనుకుంట్ల మధు అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్ మండల పరిషత్ పాఠశాలకు సహాయ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పోజెక్టర్‌ను శనివారం సంస్థ ప్రతినిధులు వేణు, మధులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలోని విద్యార్థులకు సౌకర్యాలను కల్పించేందుకు తమ సంస్థ సిద్ధంగా ఉందని, తాము అందిస్తున్న వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గణేష్, ఉపాధ్యాయులు వాసాల హరిప్రసాద్, లావణ్య, ప్రవళిక, చందన తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి

ఎల్లారెడ్డిపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కృష్ణప్రసాద్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్, పదిర తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా ఉద్యోగ, ఉపాధ్యాయుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. బిల్లులు విడుదల చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం నిధులను కేటాయించాలన్నారు. ఆ సంఘం ప్రధాన కార్యదర్శి నారాయణ, నాయకులు రమేశ్ నాయక్, రమేశ్, భరత్ తదితరులు ఉన్నారు.

నేడు కొత్త రేషన్ కార్డుల పంపిణీ

ముస్తాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని శ్రీ మాతృశ్రీ గార్డెన్‌లో కొత్తగా మంజూరైన రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ సురేశ్ తెలిపారు. మండలంలో రేషన్ కార్డులు 287 మంజూరవగా 2400 మందికి లబ్ధిచేరనున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు కార్యక్రమానికి వచ్చి కొత్త రేషన్‌కార్డులు తీసుకోవాలని కోరారు.

తాగునీటి ఎద్దడి నివారణకు కృషి

ఇల్లంతకుంట, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు ఆలయాల వద్ద తాగునీటి ఎద్దడి తీర్చాలన్నదే కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ లక్ష్యం అని బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు భూమల్ల అనీల్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని ముస్కానిపేట గ్రామంలో పోచమ్మ ఆలయం, రహీంఖాన్‌పేట గ్రామంలోని ఎల్లమ్మతల్లి ఆలయాల వద్ద శనివారం బోర్లు వేయడం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థుల విన్నపాల మేరకు నిధులు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ బత్తిని స్వామి, శక్తికేంద్ర ఇంచార్జ్ ఇట్టిరెడ్డి లక్ష్మారెడ్డి, బూత్ అధ్యక్షులు సిరవేని అంజయ్య, సామ రమణారెడ్డి, నాయకులు నాగసముద్రాల సంతోష్, కోమటిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కాట్నపెల్లి మల్లారెడ్డి, దాసరి శ్రీనివాస్, తిప్పారపు రాము, భాస్కర్, ఓరుగంటి కర్ణాకర్, పొనవేని రాజు, పినకాశి అనీల్, పిల్లి గోపి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు

తంగళ్లపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండల బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రికెట్ పోటీలను పార్టీ నాయకుడు చీటి నర్సింగరావు, జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బొల్లి రాంమోహన్, గజభీంకర్ రాజన్న, బండి దేవదాస్, కోడి అంతయ్య, వలకొండ వేణుగోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ ఏంఈఓగా సదానందం

వేములవాడ టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): వేములవాడ అర్బన్ మండల విద్యాధికారిగా బాణాల సదానందం శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏంఈవో కార్యలయానికి వచ్చిన ఆయనకు సిబ్బంది స్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన ఏంఈవోకు ఉపాధ్యాయ సంఘం నాయకులు బూర సదానందం, లక్ష్మణ్, జయలక్ష్మీ తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎంపీ నిధులతో బోరు

చందుర్తి జూలై 19 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం ఎనగల్ గ్రామంలోని ఆరెక్షత్రియ కుల సంఘం భవన ఆవరణలో బోరుకు కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ నిధులు మంజూరు చేసినట్లు మండల బిజెపి అధ్యక్షులు మొకిలే విజేందర్ తెలిపారు. సంఘం ఆవరణలో శనివారం బోరు వేయుటకు భూమి పూజ బిజెపి నాయకులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నియోజకవర్గ కన్వీనర్ మార్త సత్తయ్య, నాయకులు మల్లేశం, కమలాకర్,చారి, లింగారావు, శ్రీకాంత్, స్వామి, జలందర్, రాజు శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ

- పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు - ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



కోనరావుపేటలో కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



రుద్రంగిలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కోనరావుపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : నూతన రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని, గడచిన పది సంవత్సరాల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. కోనరావుపేట మండలం ధర్మారం శ్రీనివాస గార్డెన్స్‌లో లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు రేషన్ కార్డు ఒక గుర్తింపు కార్డుగా మారిందన్నారు. కోనరావుపేట మండలంలో 889నూతన రేషన్ కార్డులు జారీ చేస్తున్నామని అన్నారు. గతంలో 10 సంవత్సరాల్లో గత ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు కూడా మంజూరు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, వైస్‌చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్, డిఎం సివిల్ సప్లై రజిత, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, తహసీల్దార్ విజయలక్ష్మి, కాంగ్రెస్ నాయకులు నాలుక సత్యం, భాస్కర్, శ్రీనివాస్, సదానందం, నందుగౌడ్, బాదినేని బాలరాజు, కె.బాల్‌రెడ్డి, ఉప్పుల గంగయ్య, బొడ్డు రమేష్, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, లబ్ధిదారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

● చందుర్తి : ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని పెరిక కల్యాణ మండపంలో శనివారం నూతన రేషన్ కార్డులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ పేద ప్రజలకు రేషన్ కార్డు ఒక గుర్తింపు కార్డుగా మారిందన్నారు. మండలంలో 254 నూతన రేషన్ కార్డులు జారీ చేస్తున్నామని 1995మంది పేర్లను నూతనంగా నమోదు చేశామన్నారు. దాదాపు 2249 మంది పేదలకు అదనంగా రేషన్ అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రాధ, మార్కెట్ కమిటీ చైర్మన్ చెల్కాల తిరుపతి, ఏఎంసీ వైస్ చైర్మన్ బొజ్జ మల్లేశం, మాజీ జడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చింతపంటి రామస్వామి తదితరులు పాల్గొన్నారు. కాగా, మేడిపల్లి, చందుర్తి మండలాల ప్రజల కోరిక చందుర్తి-మోత్కూరురావుపేట రోడ్డు పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు. త్వరలోనే పనులు ప్రారంభం చేయడం జరుగుతుంది తెలిపారు.

● రుద్రంగి : రాష్ట్రంలోని అర్హులైన పేదలందరికీ ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలో శనివారం నూతన రేషన్‌కార్డులను పంపీణీ కార్యక్రమం ఏర్పాటు చేయగా ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరై లబ్ధిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, తహసీల్దార్ పుష్పలత, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తూం జలపతి, గ్రామశాఖ అధ్యక్షులు సామ మోహన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, మాజీ సర్పంచ్ తర్రె ప్రభలత మనోహర్, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, మాడిశెట్టి అభిలాష్, కెసిరెడ్డి నర్సరెడ్డి, తర్రె లింగం, భైరి గంగమల్లయ్య, సూర యాదయ్య, గండి అశోక్, దయ్యాల శ్రీనివాస్, ఎర్రం రాజలింగం, చెలుకల శ్రీకాంత్, ధ్యావాల దీలీప్, ఎర్రం ఆరవింద్, తదితరులు పాల్గొన్నారు.

నీటి వనరులను నింపేందుకు బీఆర్‌ఎస్ ప్రత్యేక చొరవ



చెక్‌డ్యాం వద్ద కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలతో బీఆర్‌ఎస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : నీటి వనరులను నింపేందుకు ప్రత్యేక చొరవ చూపిన ఘనత బీఆర్‌ఎస్‌దేనని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య అన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో నిర్మించిన చెక్ డ్యాం నిండు కుండలా మారడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామ శివారులోని చెక్ డ్యాం నీళ్లలో కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలతో వినూత్న ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆగయ్య మాట్లాడుతూ రైతును రాజును చేయాలనే లక్ష్యంతో కేసీఆర్ నేతృత్వంలోని గత ప్రభుత్వం చెరువుల్లో పూడికతీత, వాగులపై చెక్‌డ్యాం నిర్మాణ పనులను చేపట్టిందని అన్నారు. సాగు, తాగునీటి వనరుల అభివృద్ధికి అధిక నిధులు కేటాయించి మెట్ట ప్రాంతంలో బీళ్లు బారిన పొలాలకు నీరు అందించిందని అన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నీటి వనరులపై నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. గ్రామా ల్లో అన్నదాతలు, ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని ఆగయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, మాజీజడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, నాయకులు సుభాష్, నర్సింహారెడ్డి,శ్రీనివాస్, మురళీమోహన్‌గౌడ్, పర్శరాములు,సందీప్, బాలరాజునర్సాగౌడ్, నర్సిం లు, వెంకట్‌రెడ్డి, హసన్, దేవరాజు, వెంకటనర్సింహారెడ్డి, మజీద్, భీమేశ్వర్ ఉన్నారు.

ఫసల్ బీమా.. లేనట్లేనా?

(5వ పేజీ తరువాయి)

2.40 లక్షల ఎకరాలు, యాసంగిలో 1.80 లక్షల ఎకరాల వరకు సాగు చేస్తున్నారు. ఇందులో ప్రధానంగా వరి రెండు సీజన్‌లలోనూ 1.77 లక్షల ఎకరాల వరకు సాగు చేస్తున్నారు. ఫసల్ బీమా యోజన అమలైతే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని ఎదురుచూస్తున్నారు.

జిల్లాలో 2.43 ఎకరాల్లో వానకాలం సాగు

జిల్లాలో 2.43 లక్షల ఎకరాల సాగు అంచనాలో ఇప్పటివరకు 1.16 లక్ష ఎకరాల్లో మాత్రమే వివిధ పంటలు సాగుచేశారు. వర్షాభావ పరిస్థితులతో వరి నాట్లు సగం కూడా పూర్తి కాలేదు. పత్తి సాగు మాత్రం ముందస్తుగానే విత్తనాలు వేసుకోవడం తో చివరి దశకు చేరుకుంది. జిల్లాలో వానాకాలంలో 2 లక్షల 43,783 వేల 766 ఎక రాల్లో వివిధ పంటలు సాగు చేయడానికి రైతులు సిద్ధమయ్యారు. ఇందులో గంభీ రావుపేటలో 19,330 ఎకరాలు, ఇల్లంతకుంటలో 38,470 ఎకరాలు, ముస్తాబాద్‌లో 25,250 ఎకరాలు, సిరిసిల్లలో 5,853 ఎకరాలు, తంగళ్లపల్లిలో 22,031 ఎకరాలు, వీర్నపల్లిలో 8,792 ఎకరాలు, ఎల్లారెడ్డిపేటలో 21,130 ఎకరాలు, బోయినపల్లిలో 21,310 ఎకరాలు, చందుర్తిలో 21,610 ఎకరాలు, కోనరావుపేటలో 23,700 ఎకరాలు, రుద్రంగిలో 10105ఎకరాలు, వేములవాడలో 10578 ఎకరాలు, వేములవాడ రూరల్‌లో 15,614 ఎకరాల్లో పంటలు వేస్తున్నారు. వరి సాగు లక్షా 84 వేల 860 ఎకరాలు, మొక్కజొన్న 1,600 ఎకరాలు, పత్తి 49,760 ఎకరాలు, కందులు 1,155 ఎకరాలు, పెసర 79 ఎకరాలు, ఇతర పంటలు 6,304 ఎకరాలు, ఇతర పంటలు 6,900 ఎకరాల్లో సాగు చేస్తారని అంచనావేశారు. జిల్లాలో ఇప్పటి వరకు వరి సాగు71,690 ఎకరాలు, మొక్కజొన్న 2,403 ఎకరాలు, పత్తి 41,840 ఎకరాలు, కందులు 391 ఎకరాలు, పెసర 15 ఎకరాలు, ఇతర పంటలు 16 ఎకరాలు, ఇతర పంటలు 6,900 ఎకరాల్లో సాగు చేశారు.



ప్రకృతి వైపరీత్యాలకు దెబ్బతిన్న పంటలు(ఫైల్)

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం

వేములవాడ టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా బీజేపీ మోదీ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్ అన్నారు. వేములవాడ మండలంలోని రుద్రవరం, మారుపాక, గుర్రంవానిపల్లి గ్రామాలకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ నిధులు మంజూరు చేయడంతో శనివారం బోరుబావుల ఏర్పాటుకు భూమిపూజ చేపట్టారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్, బీజేపి నియోజకవర్గ ఇంచార్జ్ చెన్నమనేని వికాస్‌రావు, జిల్లా అధ్యక్షుడు రెడ్డవేని గోపిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ చింతపల్లి వెంకటేశ్వర్ రావు, నాయకులు నర్సింగోజు శంకర్, ఎరగొక్కుల రమేష్, గోనే భాస్కర్, చల్లా నర్సయ్య, విశ్వనాథం శ్రీధర్, సంజీవ్‌రెడ్డి, సోలంకి అరవింద్ తదితరులు ఉన్నారు.

రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలి

వేములవాడ టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): వర్షాలు భారీగా కురుస్తుండటంతో పంటలకు తగిలే తెగులు దృష్టిలో పెట్టుకుని వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తూ తగిన జాగ్రత్తలు పాటించాలని వేములవాడ వ్యవసాయ విస్తరణ అధికారి రాజు రైతులకు సూచించారు. మండల ఏవో సాయికిరణ్ ఆదేశాలతో శనివారం పట్టణంలోని శాత్రాజుపల్లి గ్రామంలో క్షేత్రస్థాయిలో రైతులతో కలిసి, వరి, పత్తి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వరి నారు మడిలో ఇనుపదాతు లోపం, కాండం తొలుచు పురుగు ఆశించడం గమనించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ఇనుపదాతు నివారణకు అన్నబేధి మందును ఎకరంకు 1 గ్రాము చెప్పున పిచికారి చేయాలని, కాండం తొలుచు పురుగు నివారణకు క్లోరాంత్రానిలిప్రోల్ గుళికలు ఎకరాకు 4 కిలోలు జల్లాలని అన్నారు. పత్తిలో రసంపీల్చు పురుగుల నివారణకు ఎసిఫేట్ లీటర్ నీటిలో 1.5 గ్రాములు కలిపి పిచికారి చేయాలని రైతులకు సూచించినట్లు తెలిపారు.

వార్డుల్లో మొక్కల పంపిణీ



మొక్కలను పంపిణీ చేస్తున్న కమిషనర్

సిరిసిల్ల టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన వన మహోత్సవం 100 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా సిరిసిల్ల మున్సిపల్ ఆధ్వర్యంలో శనివారం వార్డులలో మున్సిపల్ కమిషనర్ ఖాదీర్ పాషా, వార్డు నాయకులు మొక్కలను పంపిణీ చేశారు. స్థానిక 13, 17, 18 వార్డులలో కమిషనర్ మొక్కలను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ నేరెళ్ళ శ్రీకాంత్‌గౌడ్, 13వ వార్డు ఆఫీసర్ సిరిగిరి రాము, కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాపెల్లి కళ్యాణ్, కోడం అమర్నాథ్, వడ్లకొండ మధు, వార్డు మహిళలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక గోరింటాకు వేడుక

వేములవాడ టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని సామూహిక గోరింటాకు వేడుకను నిర్వహించారు. స్థానిక భీమేశ్వర గార్డెన్‌లో విశ్వహిందు పరిషత్, మాతృశక్తి, దుర్గ వాహిని ఆధ్వర్యంలో సామూహిక గోరింటాకు వేడుకను శనివారం నిర్వహించారు. మహిళలు ఒక్కచోట చేరి గోరింటాకును సేకరించి చేతులకు అలంకరించుకున్నారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లాఉపా ధ్యక్షురాలు రుద్రోజు స్వరూప, అశోక్, విద్యాసా గర్, గడప కిషోర్‌రావు, గౌరిశెట్టి శ్రీనివాస్ శరత్, ప్రశాంత్‌తోపాటు మహిళలు, యువతులు పాల్గొన్నారు.

బనకచర్లపై విద్యార్థులకు అవగాహన

సిరిసిల్ల టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాలలో బనకచర్లపై విద్యార్థులకు అవగాహన సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీష్ మాట్లాడారు. గోదావరిలో తెలంగాణ నీటి వాటా తేల్చేంతవరకు ఆంధ్ర బనకచర్లను అడ్డుకుంటామనే నినాదంతో జిల్లాలోని కళాశాలల విద్యార్థులకు ఐదు రోజులపాటు బనకచర్యలపై అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ పార్టీలు కలసి తెలంగాణకు చేస్తున్న అన్యాయాన్ని వివరిస్తూ బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో ముద్రించిన కరపత్రాలను విద్యార్థులకు పంచారు.

ఎల్లారెడ్డిపేట ఎస్‌ఐపై ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు

ఎల్లారెడ్డిపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : తనను ఓ వ్యక్తి చంపేందుకు ప్రయత్నిస్తున్నాడని పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయిస్తే కేసు నమోదు చేసి నిందితుడికే మద్దతు పలుకుతున్నారని పేర్కొంటూ ఎల్లారెడ్డిపేట ఎస్ఐ రాహుల్‌రెడ్డిపై జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేశానని గంభీరావుపేట మండలం దమ్మన్నపేటకు చెందిన మంగళి చంద్రమౌళి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని జాతీయ ఎస్సీ కమిషన్, రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్, డీజీపీకి ఫిర్యాదు చేశానని బాధితుడు పేర్కొన్నారు.

విద్యార్థుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

వేములవాడ టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జూనియర్ కళాశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెం టనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ సంజన డిమాండ్ చేశారు. వేములవాడ పట్టణంలోని జూనియర్ కళాశాలను శనివారం సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూనియర్ కళాశాలలో మౌలిక సదుపాయాలు కూడా కల్పించడం లేదన్నారు. విద్యార్థులకు వాష్ రూమ్‌లు కూడా సరిగా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె వెంట ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు సాయిభరత్, శివ నాయకులు బన్నీ, రాకేష్, హేమంత్, మహేష్, చందు, అశ్విని, అఖిల, గాయత్రి, హంసిక, రేణుక, సింధు ఉన్నారు.

విద్యా సంస్థల్లో ముందస్తు బోనాల సంబరాలు



సిరిసిల్లలోని ఇంగ్లీష్ యూనియన్ హైస్కూల్‌లో బోనాల వేడుకలు



ఎల్లారెడ్డిపేటలో బోనాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు



తండా పాఠశాల విద్యార్థుల ఆటపాటలు..

సిరిసిల్ల రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ఆషాఢ మాసంలో చేపట్టే పోచమ్మ తల్లి బోనాల పండుగలపై అవగాహన కల్పించేందుకు శనివారం పట్టణంలోని ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. సిరిసిల్ల పట్టణం అశోక్‌నగర్‌లోని సెలెస్టియల్ ఇంగ్లీష్‌మీడియం హైస్కూల్. ఇంగ్లీష్ యూనియన్ హైస్కూల్‌లల్లో విద్యార్థులతో పోచమ్మ తల్లి బోనాల మహోత్సవాన్ని చేపట్టారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ బుర్ర రాధకృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ మచ్చ ఇందిర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు ఆయాగ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ముందస్తు బోనాల వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● వీర్నపల్లి : మండలకేంద్రంలోని పీఎంశ్రీ ప్రాథమిక పాఠశాల, గర్జనపల్లి తండా పాఠశాలతో పాటు ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఆషాఢ మాసం బోనాల పండగను శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఆదర్శ పాఠశాలలో గోరింటాకు పండగ సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.అశోక్, పాఠశాలల ప్రధానోపధ్యాయులు ఉదయలక్ష్మి, తిరుపతి జాదవ్, కావేరి, పీడీ ప్రతాప్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గోన్నారు.

● ఇల్లంతకుంట : మండలంలోని దాచారం, సిరికొండ, వల్లంపట్ల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, వాణీనికేతన్, వివేకానంద, శ్రీసాయి, శ్రీవాణి తదితర పాఠశాలలో శనివారం విద్యార్థులు బోనాలు సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి చెప్యాల శ్రీనివాస్‌గౌడ్, ప్రధానోపాధ్యాయిణీలు రాణి, తూమకుంట శ్రీనిధి, పండరీనాథ్, రమేష్, సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● గంభీరావుపేట : గంభీరావుపేట మండలం లింగన్నపేట శ్రీసాయి హైస్కూల్ శనివారం భోనాల వేడుకను నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ పదతిలో నూతన వస్త్రాలు దరించి భోనాలను ఎత్తుకుని పాఠశాలకు వచ్చి, ఉత్సాహంగా వేడుకలో పాల్గొన్నారు. అనంతరం సమీప అలయం వరకు బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్ళి సమర్పించారు. ప్రదానోపాధ్యాయరాలు మాధవి, ఉపాధ్యాయులు ఉన్నారు.

● వేములవాడ కల్చరల్ (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని ద్రోణ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో శ్రీ బద్ది పోచమ్మ అమ్మవారికి శనివారం ఘనంగా బోనాలు తీశారు. విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కాగా స్కూల్ నిర్వాహకులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

● కోనరావుపేట : కోనరావుపేట మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో బోనాల ఉత్సవాలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ శివకుమార్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

● చందుర్తి :చందుర్తి మండల కేంద్రంతోపాటు సనుగుల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలల్లో శనివారం బోనాల పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామదేవతలకు నైవేద్యాన్ని సమర్పించారు. విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.